సాక్షి
పల్నాడు
గురువారం । 4 । మే । 2023



1,17,725 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): యార్డుకు బుధవారం 1,12,240 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,17,725 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000 , గరిష్ట ధర రూ.4,200 , మోడల్ ధర రూ.3,200 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి



వినుకొండ(నూజెండ్ల): కుక్కల దాడిలో చుక్కల దుప్పి గాయపడి మృతి చెందింది. ఈ ఘటన పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు చోటు చేసుకుంది. ఫారెస్ట్ రేంజ్ అధికారి హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి కనిపించింది. వారు తమకు సమాచారం అందజేయడంతో సంఘటన స్థలానికి వెళ్లి దుప్పిని అటవీశాఖ కార్యాలయానికి తీసుకొచ్చే క్రమంలో దుప్పి చనిపోవడం జరిగిందని, పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ పశువైద్యశాలకు తరలించడం జరిగిందన్నారు. అరణ్యం నుంచి తప్పిపోయిన వన్యప్రాణులు పట్టణ ప్రాంతాలు, జనావాసాల్లోకి వస్తున్నాయని, ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ప్రజలు అధికారులకు తెలియజేయాలని కోరారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు ఒక్కరోజు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు బుధవారం ముగిసిన గడువును గురువారం సాయంత్రం వరకు పొడిగించినట్లు ఆర్‌ఐఓ జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల నుంచి మార్చిలో జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజులను గురువారం సాయంత్రం లోపు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

హెరిటేజ్ మ్యూజియంలో శిల్పాల పరిశీలన



అమరావతి: ప్రపంచ స్థాయి సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనకు ఎంపికైన అమరావతి బౌద్ధ స్థూపాలను అధికారుల బృందం బుధవారం సందర్శించింది. బృందంలో భారత పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ జీనా గోపీనాథ్, సూర్యప్రకాష్, రాష్ట్ర ఆర్కియాలజీ శాఖ డెప్యూటీ డైరెక్టర్లు సురేష్, రామసుబ్బారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ స్వామినాయక్ ఉన్నారు. భారత పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ జీనా గోపీనాథ్ మాట్లాడుతూ అమెరికాలోని న్యూయార్క్ మెట్రోపాలిటిన్ మ్యూజియంలో నిర్వహించే ట్రీ సెర్పెంట్ ది ఎవల్యూషన్ ఎర్లీ బుద్ధిస్ట్ ఆర్ట్ ఇన్ ఇండియా కార్యక్రమంలో ఈ స్థూపాలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. శిల్పాలను తరలించే బాధ్యత ప్రభుత్వం ఒక సంస్థకు అప్పగించిందన్నారు. వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

నరసరావుపేట ఈస్ట్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం పేదలకు కేటాయించిన 25శాతం సీట్లు భర్తీ చేసేందుకు రెండవ విడత అవకాశం కల్పిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ బుధవారం తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 15 వరకు గడువు పొడిగించినట్టు వివరించారు. అర్హులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన పిల్లలకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

నేడు 'బావుడా' కార్యాలయం ప్రారంభం

బాపట్ల: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బావుడా) కార్యాలయం గురువారం ప్రారంభిస్తునట్లు బావుడా వైస్ చైర్మన్ ఎ.భాను ప్రతాప్ బుధవారం తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో సాయంత్రం 4.30గంటలకు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బావుడా చైర్మన్‌గా దేవినేని మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు.

ఆధునిక సాగుకు చేయూత

రెండో విడత యంత్రసేవకు సన్నాహాలు

- అధునాతన పద్ధతిలో సాగుకు రైతులకు రాయితీపై యంత్రాలు
- జిల్లాలో 421 కస్టమ్ హైరింగ్ సెంటర్లు
- ఇప్పటికే 225 సంఘాలకు యంత్రాలు మంజూరు
- రెండో విడతలో మరో 146 సీహెచ్‌సీల కోసం దరఖాస్తుల స్వీకరణ



రైతులకు పంపిణీ చేసిన ట్రాక్టర్‌ను నడుపుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం రైతుల ఖాతాలలో నేరుగా జమ అవుతోంది. కర్షకులకు మరింత చేదోడుగా ఉండాలని జగనన్న చేపట్టిన సరికొత్త పథకం కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) ఏర్పాటు. అధునాతన పద్ధతిలో సాగు చేసేందుకు యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది.

225 సంఘాలకు రూ.21.84 కోట్లు విలువ చేసే యంత్రాలు..

సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించి, సాగు ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాలో తొలి విడత మెగా మేళా పేరిట 225 సంఘాలకు రూ.21,84,04,107 విలువ చేసే యంత్రాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. వీటికి గాను ప్రభుత్వం రాయితీ కింద రూ.8,05,27,346 భరించింది. యూనిట్‌లో 50 శాతం మొత్తాన్ని రైతులకు బ్యాంక్‌రుణం ద్వారా అందజేశారు. తొలి విడతలో 199 ట్రాక్టర్ ఇంజిన్లను రైతులకు అందజేశారు. ఇప్పుడు రెండో విడతలో భాగంగా మరో 146 సంఘాలకు అధునాతన వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొంత మంది రైతులు తమకు కావాల్సిన యంత్రాలను ఎంపిక చేసుకొనే పనిలో ఉన్నారు. ఈ నెల చివర్లో రెండో మెగా మేళా నిర్వహించి యంత్రాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ సిద్ధమవుతోంది.

40 శాతం సబ్సిడీతో పంపిణీ...

పల్నాడు జిల్లాలో మొత్తం 421 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రతి కేంద్రానికి ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌బీకే పరిధిలోని ఐదుగురు ఔత్సాహిక రైతులను గుర్తించి బృందంగా ఏర్పాట చేశారు. ఒక్కో సీహెచ్‌సీకి రూ.15 లక్షల చేసే యంత్ర పరికరాలు ఇస్తున్నారు. యూనిట్ విలువలో ప్రభుత్వం ఇచ్చే రాయితీ 40 శాతం (రూ.6 లక్షలు), బ్యాంకు రుణం 50 శాతం (రూ.7.50 లక్షలు), లబ్ధి పొందే రైతుల వాటా 10 శాతం (రూ.1.50 లక్షలు) లెక్కన చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో రైతులకు ఉపయోగపడే ట్రాక్టరు ఇంజిన్, ట్రాలీ, దుక్కుల యంత్రం పరికరాలు, విత్తన గొర్రు, రోటా వేటర్, పవర్ టిల్లర్లు, బహుళ నూర్పిడి యంత్రాలు, స్ప్రేయర్లు, లోతు దుక్కుల పరికరాలు, కలుపు తీసే పరికరాలను అందజేస్తున్నారు. రైతు అవసరం, అభిరుచి ఆధారంగా యంత్రాలను ఎంపిక చేసుకోవచ్చు. రాయితీపై పొందిన యంత్రాలను రైతు సంఘాలు మిగిలిన రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చుకొని ఆదాయం పొందవచ్చు.



పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామ సీహెచ్‌సీకి అందజేసిన బేలర్ యంత్రం

రెండో విడత పంపిణీకి ఏర్పాట్లు...



తక్కువ పెట్టుబడి, అధునాతన పద్ధతుల్లో రైతులు పంటలు పండించుకోవడానికి ప్రభుత్వం రాయితీపై యంత్రాలను సరఫరా చేస్తోంది. ఇప్పటికే మొదటి విడత మెగా మేళా నిర్వహించి సుమారు రూ.22 కోట్ల విలువైన యంత్రాలను పంపిణీ చేశాం. రెండో విడత యంత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. సీఎం చేతుల మీదుగా త్వరలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానుంది.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయ అధికారి, పల్నాడు జిల్లా.

ఎంతో ఉపయోగపడుతున్నాయి



ప్రభుత్వం సీహెచ్‌సీ కింద మా గ్రూప్‌నకు రూ.14.16 లక్షల విలువ చేసే సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, బేలర్, రోటావేటర్ యంత్రాలను అందజేసింది. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.5.32 లక్షలు, బ్యాంక్ రుణం ద్వారా రూ.7.08 లక్షలు చెల్లించగా, ఐదుగురు రైతులం మా వాటాగా రూ.1.75 లక్షలు చెల్లించాం. ఈ యంత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– మూదేల నాగిరెడ్డి, కరాలపాడు, పిడుగురాళ్ల మండలం



భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేసేందుకు వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ, ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని – సాక్షి నెట్‌వర్క్

పంట నష్టాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: వర్షాలకు పంటలు దెబ్బతినకుండా ముందస్తు అవగాహన కార్యక్రమాలను వ్యవసాయాధికారులు సత్వరం చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జిల్లాలో దుగ్గిరాల, కొల్లిపర, కాకుమాను మండలాల్లో అధిక వర్షాలు పడ్డాయన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం పునరుద్ధరించేందుకు చేపట్టాల్సిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు భయపడవద్దని, నష్టం జరిగిన సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ప్రభుత్వం పరిహారం అందిస్తుందని చెప్పారు.



లేమల్లెపాడులో తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి ఎన్.సుజాత

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

పర్చూరు (కారంచేడు): మండలంలోని వీరన్నపాలేనికి చెందిన దార స్వరూప (28) బుధవారం ఉదయం ఇంటి వద్ద ఉతికిన బట్టలు ఆరేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే పర్చూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో కుటుంబంతోపాటు, గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్వరూప భర్త కిరణ్ అదే గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద పిల్లలు విలపిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.



వీరన్నపాలెంలో మృతి చెందిన స్వరూప

మేధోపరమైన ఆవిష్కరణలతో అద్భుతాలు

- సమాజానికి ఏమి ఇచ్చాం అనేది ముఖ్యం
- బెంగళూరు ఇస్రో సీబీపీఓ డైరెక్టర్ సుధీర్ కుమార్
- ఘనంగా డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ గ్రాడ్యుయేషన్ డే



బెంగళూరు ఇస్రో సీబీపీఓ డైరెక్టర్ సుధీర్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, పక్కన రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ తదితరులు

ఏఎన్‌యూ: విశ్వాసం, భావవ్యక్తీకరణ నైపుణ్యం ఉన్న యువతను ఏ శక్తి అడ్డుకోలేదని బెంగళూరు ఇస్రో కెపాసిటీ బిల్డింగ్ అండ్ పబ్లిక్ ఔట్ రీచ్ (సీబీపీఓ) డైరెక్టర్ ఎస్.సుధీర్ కుమార్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం జరిగిన డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్ కుమార్ ప్రసంగిస్తూ మేధోపరమైన ఆవిష్కరణలతో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. అంతర్గత ఆలోచనలను అద్భుతమైన శక్తిగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. జీవితంలో ఎంత ఉన్నత స్థితికి చేరినా దానికి కారణం తల్లిదండ్రులే అనేది గుర్తుంచుకోవాలన్నారు. సమాజం నుంచి ఇప్పుడు ఎంతో పొందుతున్నారని, స్థిరపడిన తరువాత సమాజానికి కూడా తిరిగి ఇవ్వాలనే వాస్తవం గుర్తెరగాలన్నారు. యువ శక్తి సన్మార్గంలో నడిస్తే మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని తెలిపారు. కుటుంబం, యూనివర్సిటీ, సమాజం గర్వించే పౌరులుగా ఎదిగితేనే డిగ్రీకి సార్థకత ఉంటుందన్నారు. వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ మానవత్వం, ఉన్నత వ్యక్తిత్వం లేకపోతే డిగ్రీకి ప్రయోజనం లేదన్నారు. ప్రపంచంలో ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి ప్రసంగిస్తూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ప్రసంగిస్తూ అంకితభావం, సామాజిక బాధ్యత ఉన్న ఇంజినీర్లుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్దయ్య కళాశాల నివేదిక సమర్పించారు. డీన్ ఆచార్య శ్రీనివాస రెడ్డి, పలువురు అధ్యాపకులు ప్రసంగించారు. యూనివర్సిటీ కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఇస్రో సీబీపీఓ డైరెక్టర్, వీసీ డిగ్రీలు అందజేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో ఎస్పీ అదపా సాయి శ్రీనివాస్

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్...

ఏఎన్‌యూ: కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందనే వాస్తవాన్ని విద్యార్థులు గ్రహించాలని కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో ఎస్పీ అదపా సాయిశ్రీనివాస్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం జరిగిన డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కాలేజీడే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఇంజినీరింగ్ విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గాయకుడు, ఫిలిం మ్యూజిక్ డైరెక్టర్ యశ్వంత్ నాగ్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం ఉత్సాహంగా ఉంటూ అన్ని కళలలోనూ ముందుండి, మంచి భవిష్యత్తు రూపొందించుకోవాలన్నారు. 'పరేషాన్' చలనచిత్ర బృందం విద్యార్థులను విశేషంగా అలరించింది.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం బాపట్ల మండలంలోని మూలపాలెం జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ మూలపాలెం జగనన్న కాలనీలో మొత్తం 990 గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మూలపాలెం జగనన్న కాలనీలో 140 గృహాలు పునాదుల స్థాయిలోనే ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. మూలపాలెం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పంటకాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రంలో మజ్జిగను అందజేశారు. ఆయనవెంట డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్, బాపట్ల ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సంరక్షణకు కృషి..

బాపట్ల: దివ్యాంగుల హక్కుల సంరక్షణకు అధికారులంతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. దివ్యాంగుల సంరక్షణపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటైంది. కమిటీ చైర్మన్, కలెక్టర్ చాంబర్లో బుధవారం జిల్లాస్థాయి కమిటీ తొలి సమావేశం జరిగింది. దివ్యాంగుల సంక్షేమం, హక్కుల సంరక్షణ కోసం 2016లో ఏర్పాటైన చట్టం పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 22 మందితో జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటైందని కలెక్టర్ ప్రకటించారు. మానసిక దివ్యాంగుల సంరక్షణపై పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు వృత్తి నైపుణ్యాల వృద్ధికోసం అనుబంధ శాఖల అధికారులు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతివైద్యశాలలోనూ దివ్యాంగులకు ప్రత్యేకంగా బెడ్లు కేటాయించి వైద్య సేవలు అందించాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చట్టం, నియమనిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు, డీపీఓ రమేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి వెంకటేశ్వర్లు, మిగిలిన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఓల్డ్ ఈజ్ గోల్డ్

- తెలుగు పురావస్తు పరిశోధకుడికి ఎస్సీ చక్రవర్తి స్మారక బంగారు పతకం
- ఆసియాటిక్ సొసైటీ అత్యున్నత పురస్కారాన్ని స్వీకరించిన డాక్టర్ కాట్రగడ్డ పద్దయ్య

తెనాలి: భారతీయ విజ్ఞానశాస్త్రాల్లో అగ్రగామి పరిశోధనలు చేసినవారికి కోల్‌కతాలోని ఏషియాటిక్ సొసైటీ అత్యున్నత పురస్కారాన్ని గుంటూరు జిల్లాకు చెందిన విశ్వవిఖ్యాత పురావస్తు పరిశోధకుడు, ఎమిరిటస్ ప్రొఫెసర్ డాక్టర్ కాట్రగడ్డ పద్దయ్య స్వీకరించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కోల్‌కతాలో గల స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ ఏషియాటిక్ సొసైటీ. ఈనెల ఒకటో తేదీన అక్కడే జరిగిన ప్రత్యేక సభలో ప్రముఖ తాత్వికవేత్త, నాణేల పరిశోధకుడు, కోల్‌కతా విశ్వవిద్యాలయ ఆచార్యుడు సుధీంద్రచంద్ర చక్రవర్తి పేరిట ఏర్పాటుచేసిన స్మారక అవార్డు (2022), బంగారు పతకాన్ని బెంగాల్ గవర్నర్ డాక్టర్ ఆనంద్‌బోస్ చేతులమీదుగా డాక్టర్ పద్దయ్య అందుకున్నారు.



ఎస్‌సీ చక్రవర్తి అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ పద్దయ్య

పాములపాడు స్వస్థలం..

జిల్లాలోని తాడికొండ మండల గ్రామం పాములపాడు డాక్టర్ పద్దయ్య స్వస్థలం. రైతుకుటుంబంలో 1943లో జన్మించారు. పూనేలో డెక్కన్ కాలేజీలో ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త, పద్మశ్రీ హెచ్‌డీ సంకాలియా శిష్యుడిగా ఎంఏ చేశారు. సంకాలియా నేతృత్వంలోనే ప్రాక్ చరిత్రపై పరిశోధనలు చేసి 1969లో డాక్టరేట్ అందుకున్నారు. 1970లో నెదర్లాండ్‌లో మరికొన్ని పరిశోధనల అనంతరం డెక్కన్ కాలేజీలో పురావస్తు శాస్త్రవిభాగంలో అధ్యాపకుడిగా వృత్తి జీవితం ప్రారంభించారు. మరోవైపు తన పరిశోధనలు కొనసాగిస్తూ కర్ణాటక రాష్ట్రంలో 1,2 మిలియన్ సంవత్సరాల క్రితం విలసిల్లిన పురాచరిత్రపై విశేష పరిశోధనలు చేశారు.

2012లో పద్మశ్రీ అవార్డు..

భారత ప్రభుత్వం ఆయనను 2012లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. పురావస్తుశాస్త్రంలో పద్మశ్రీ అందుకున్న తొలి తెలుగుబిడ్డగా ఖ్యాతిని పొందారు. తన ఉన్నతికీ, లభించిన పురస్కారాలకు తన గురువులైన మల్లంపల్లి సోమశేఖరశర్మ, హెచ్‌డీ సంకాలియాలే కారకులని డాక్టర్ పద్దయ్య 'సాక్షి'తో ఫోనులో చెప్పారు. పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి డాక్టర్ పద్దయ్యను అభినందించారు.

అందచందనాల నారసింహా నమో..



కళాశాభిషేకంలో పాల్గొన్న భక్తులు

చందనాలంకారంలో దర్శనమిస్తున్న స్వామి వారి ఉత్సవ విగ్రహాలు

పల్నాడు యాదాద్రిగా పేరొందిన భూ సమేత నరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నాలుగో రోజు బుధవారం వైభవంగా కొనసాగాయి. గురజాల నగర పంచాయతీ జంగమహేశ్వరపురంలో రైల్వే గేటు సమీపంలో ఉన్న ఆలయాన్ని ఇటీవలే పునర్నిర్మించారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అష్టోత్తర కలశాభిషేకం అనంతరం చందనాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను తిరుమల తిరుపతి వేద పండితులు యుగంధరాచార్యులు, సునీల్ నరసింహాచార్యులు, ఆలయ అర్చకులు కారంపూడి రాఘవచార్యులు, వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. – గురజాల

ప్రభుత్వ పథకాల ప్రగతి నివేదిక పంపండి

రెవెన్యూశాఖ అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాదు

నరసరావుపేట: జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ పథకాల అమలు, పురోగతికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాస్థాయి రెవెన్యూ అధికారులతో కలిసి కలెక్టర్ ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రధానంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం క్షేత్రస్థాయి ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. రీ–సర్వే పనులు, భూములకు హద్దు రాళ్ళు వేయడం, స్పందన సమస్యల పరిష్కారం, మ్యుటేషన్ సర్వీసులు, భూ సేకరణ కార్యక్రమం, ఎన్నికలకు సంబంధించి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం, మార్పులు, చేర్పులు, ఓటర్ కార్డు బదిలీలు, అటవీశాఖ భూముల గుర్తింపు, లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు, భూ పంపిణీకి తీసుకున్న చర్యలు, జిల్లావ్యాప్తంగా వృద్ధుల చట్టం అమలు తీరు, ప్రభుత్వం అందిస్తున్న సహకారం తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వసంత్‌బాబు, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనిల్‌కుమార్, కలెక్టరేట్‌లోని సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పంటనష్టం జరగకుండా చూడండి

నరసరావుపేట: అకాల వర్షాలకు పంట నష్టం వాటిల్లకుండా చూడాలని రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పెషల్ చీఫ్ సెక్రటరి పూనం మాలకొండయ్య, ఆయా శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో పల్నాడు జిల్లా నుంచి కలెక్టర్, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేయాలన్నారు. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఇతర ఉద్యాన పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరించాలని సూచించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

వ్యసనాలకు అలవాటు పడి చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి

కొల్లిపర: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మూడు నెలలుగా బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు తెనాలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితులు ముగ్గురు తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందినవారు. బండి కళ్ళ చాయకుమార్, గోవతోటి రత్నబాబు (కళ్యాణ్), పల్లె కొండ దుర్గాప్రసాద్ ముగ్గురూ స్నేహితులు. వీరు చదువు మానేసి కూలి పనులు చేసేవారు. వీరు జల్సాలు చేస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడి వచ్చే కూలి డబ్బులు చాలక సులభమైన పద్ధతిలో సంపాదించాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి నెల నుంచి ముగ్గురూ బైకులు దొంగతనాలు ప్రారంభించారు. కొల్లిపరలో 1, మంగళగిరి టౌన్‌లో 2, ఫిరంగిపురంలో 1, తాడేపల్లిలో 1, దుగ్గిరాలలో 2, చేబ్రోలులో 1 కలసి మొత్తం 8 మోటార్ సైకిళ్లు దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.10.20 లక్షలు ఉన్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా సీసీఎస్ సహకారంతో, తెనాలి రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి తన సిబ్బందితో దావులూరు అడ్డ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు బైకు దొంగలను అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు విషయం తెలిసిందన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత ముఖ్యంగా జల్సాలకు అలవాటుపడి, మత్తు మందులకు బానిసగా మారి వారి వద్ద డబ్బులు లేక ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దొంగతనాలు చేసిన వారిపై ఎప్పుడూ పోలీసుల నిఘా ఉంటుందని, ఏదో ఒక రోజున దొంగతనం చేసిన వారు పట్టు పడక తప్పదని హెచ్చరించారు. కేసు ఛేదించిన ఎస్.రవీంద్రరెడ్డితో పాటు ఏఎస్ఐ ఎ.పోతురాజు, రైటర్ డి.శ్యామ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ బి.తాతారావు, కానిస్టేబుల్‌లు ఎం.కూర్మారావు, పి.చంద్రకుమార్, కె.విజయశేఖర్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీదుర్గ



కొరిటిపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రైతు సాధికార సంస్థ ఆరోగ్యం, పౌష్టికాహార విభాగం(హెల్త్ అండ్ న్యూట్రిషన్) సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీదుర్గ తెలిపారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెంటార్లకు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారానికి నాలుగో రోజుకు చేరింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 821 మిలియన్ ప్రజలలో పౌష్టికాహార లోపం ఉందని చెప్పారు. 149 మిలియన్ చిన్నపిల్లలు వయసుకు తగిన ఎత్తు లేకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నారని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య స్థితిగతులు ఆందోళన కలిగించేలా ఉన్నాయని, ప్రపంచం మొత్తంలో రెండు బిలియన్ ప్రజలు అధిక బరువు(ఓవర్ వెయిట్)తో బాధపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులను తినడం వలన అనారోగ్య సమస్యలకు స్వస్తి పలకవచ్చనని అన్నారు. రసాయన వ్యవసాయ ఉత్పత్తులలో రోజు రోజుకూ పోషక విలువలు నశించి పోతున్నాయని, ఈ విధానం ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ప్రతి మనిషి మూడు నుంచి ఐదు రెట్ల ఆహారం తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు సాధికార సంస్థ ఆరోగ్య విభాగంలో 129 గ్రామాల్లో అమలు చేస్తున్న పైలట్ ప్రాజెక్టులో ఇంటి వద్ద పెరటి తోటలు, పౌష్టికాహార తోటలు, సామూహిక పెరటి తోటలు పెంచుకొనేలా మహిళలను ప్రోత్సహించడం వలన మంచి ఫలితాలు వస్తున్నాయని, ఆయా గ్రామాలలో పౌష్టికాహార లోపం తక్కువగా కనిపిస్తోందని అన్నారు. రైతు సాధికార సంస్థ సర్టిఫికేషన్ విభాగపు థిమాటిక్ లీడ్ రాము మాట్లాడుతూ రైతులు విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా అధిక ఆదాయం పొందే మార్గాలను వివరించారు.

దివ్యాంగుల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి



మోటారు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దివ్యాంగుల కోసం విశేష కృషి చేస్తోందని, వారి కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) చెప్పారు. బుధవారం మాచర్ల ఎంపీపీ కార్యాలయంలో దివ్యాంగులకు ఉచితంగా మోటారు ట్రైసైకిళ్లను అందజేశారు. పేదలు, వికలాంగులు, అంధులతోపాటు అన్ని వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ సర్కారు అని అన్నారు. రాబోయే రోజుల్లోనూ వైఎస్సార్‌సీపీ మేలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు మల్లు స్వామి, వెల్దుర్తి ఎంపీపీ తనయుడు ఆదినారాయణ, గొర్రెల పెంపకం దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సైదులు, కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు ఓరుగంటి చిన్నా, నోముల కృష్ణ, ఎంపీడీఓ కోటేశ్వరరావు, పంచాయితీ రాజ్ శాఖాధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పసుపు రైతు రాష్ట్ర కన్వీనర్‌గా జొన్నా శివశంకరరావు



తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల గ్రామపరిధిలోని రైలుపేటలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పసుపు రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పసుపు రైతుల రాష్ట్ర కన్వీనర్‌గా జొన్నా శివశంకరరావును ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పసుపు రైతులకు గిట్టుబాటు ధర లభించక అనేక కష్టాలు పడుతున్నారని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా ఆరబెట్టిన పసుపు తడిసి ఎర్రబడిందని, అందువల్ల వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. పసుపు కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, పసుపు క్వింటాకు మద్దతు ధర 10 వేల రూపాయలు ప్రకటించాలని, జాతీయ స్థాయిలో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

వైభవంగా వీరభద్రస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



సన్మాన జ్ఞాపికలతో మంత్రులు కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు: కుంకలగుంట గ్రామంలో భద్రకాళీ సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి, పరివార ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. జీర్ణోద్ధరణ జరుపుకున్న పురాతన ఆలయంలో వీరభద్రస్వామి, కొత్తగా నిర్మించిన ఆలయంలో గణపతిస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అభయాంజనేయస్వామి విగ్రహాలు, జీవ ధ్వజ, కీర్తిధ్వజ, విమానగోపురం, పరివారదేవతా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం, కుంభాభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. ముఖ్యఅతిథులుగా దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తదితరులు హాజరయ్యారు. వీరికి వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామస్తులంతా కలసికట్టుగా ఆలయం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. దేవదాయశాఖ తరఫున ధూపదీప నైవేద్యాల కోసం ప్రతినెలా రూ.5 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గ్రామస్తులంతా ఐక్యంగా ఆలయం నిర్మాణానికి పూనుకోవడం గొప్పవిషయమన్నారు. అనంతరం జరిగిన భారీ అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పూల ధన్వంతరి, నిర్వాహకులు కందిమళ్ల చంద్రశేఖర్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా రూబీ జూబ్లీ వేడుకలు



దివ్య బలి పూజలో పాల్గొన్న బిషప్‌లు

నెహ్రూ నగర్: రూబీ జూబ్లీ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు బిషప్ మోస్ట్ రెవ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య గురువుగా అభిషక్తులై 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గుంటూరు మేత్రాసనం ఆధ్వర్యంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా గుంటూరు డాన్ బాస్కో స్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. తొలుత లక్ష్మీపురం కూడలిలో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి బిషప్ మోస్ట్ రెవ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్యను గుర్రపు బగ్గీలో అంగరంగ వైభవంగా మేళ తాళాలతో తోడుకొని డాన్ బాస్కో ప్రాంగణం వరకు తీసుకొచ్చారు. అనంతరం భక్తుల సమక్షంలో దివ్య బలి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పోప్ దూత కార్డినల్ పూల ఆంథోనీ పాల్గొన్నారు. భాగ్యయ్య మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా గురువుగా కొనసాగటం దేవుడు ఇచ్చిన ధన్యతగా భావిస్తున్నామని చెప్పారు. అనంతరం బిషప్ మోస్ట్ రెవ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని మేత్రాసన పీఠాధిపతులు, నిర్వాహక కమిటీ కన్వీనర్ అల్లం శౌరి రెడ్డి కమిటీ సభ్యులు కొచ్చర్ల జ్యోతి రాజు, కనపాల జోసెఫ్, ఉన్నవ కిరణ్ పాల్గొన్నారు.

పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందించాలి

అశోక్ న్యూరోకేర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు



హాస్పిటల్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బ్రహ్మనాయుడు

నరసరావుపేట: పేదప్రజలకు తక్కువ ఖర్చులో వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత ప్రైవేటు వైద్యశాలలపై ఉందని ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. గుంటూరురోడ్డులో డాక్టర్ పాతూరి అశోక్ ఏర్పాటు చేసిన అశోక్ న్యూరోకేర్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌ను ఎమ్మెల్యేలు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అశోక్ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించి అందరి ఆదరాభిమానాలు పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ప్రారంభోత్సవంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రావెల సత్యనారాయణ, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ రవీంద్ర.చందు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి అపరాల సాగుతో రైతులకు మేలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు

వేజండ్ల(చేబ్రోలు): వేసవిలో అపరాల సాగు చేయటం ద్వారా భూ సారం పెరగటంతో పాటు, రైతుకు లాభం చేకూరుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల రైతు భరోసా కేంద్రంలో బుధవారం జాతీయ ఆహార భద్రత పథకం కింద క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరి తరువాత అపరాల సాగు వలన తెగుళ్లు, పురుగుల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ తిరుమలాదేవి, ఏఓ బి.శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు. అపరాల సాగులో చేపట్టాల్సిన మెలకువలు, భూసారం తదితర అంశాల గురించి వివరించారు. రబీలో సాగు చేస్తున్న తెల్లజొన్న, మొక్కజొన్న తడిచిన గింజలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అల్లూరివారిపాలెంలో యువకుడి హత్య

వివాహేతర సంబంధమే కారణం!



నరసరావుపేట రూరల్: వివాహేతర సంబంధం నేపథ్యంలో యువకుడిని కిడ్నాప్ చేసి తీవ్రంగా గాయపర్చడంతో అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని అల్లూరివారిపాలెంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గుంటూరు జేమ్స్(33) ఆటోడ్రైవర్. కాలనీకి చెందిన వివాహితతో జేమ్స్ కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో మూడు నెలలుగా జేమ్స్ కుటుంబానికి, వివాహిత కుటుంబానికి మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి అల్లూరివారిపాలెం నుంచి నరసరావుపేటకు ఆటోలో తన స్నేహితునితో బయలుదేరిన జేమ్స్‌ను గ్రామశివారులో పెట్రోల్‌బంక్ వద్ద వివాహిత బంధువులు ముగ్గురు అడ్డగించారు. జేమ్స్ స్నేహితుడిని బయటకు లాగివేసి బలవంతంగా ఆటోను పాలపాడు రోడ్డు వైపు తీసుకువెళ్లారు. జేమ్స్ స్నేహితుడు ఇచ్చిన సమాచారంతో బంధువులు సమీప ప్రాంతాల్లో గాలించినా జాడ కనిపించలేదు. దీంతో రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రొంపిచర్ల మండలం మర్రిచెట్టుపాలెం గ్రామసమీపంలో తీవ్రగాయాలతో ఆటోలో అపస్మారక స్థితిలో ఉన్న జేమ్స్‌ను పోలీసులు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో జేమ్స్ మృతిచెందాడు. జీజీహెచ్‌లో మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో ఏపీ సచివాలయ పోస్ట్‌మెన్ మృతి



మంగళగిరి: ప్రమాదవ శాత్తూ ద్విచక్ర వాహనం చెరువులోకి దూసుకువెళ్లి ఏపీ సచివాలయ పోస్ట్‌మెన్ మృత్యువాత పడిన ఘటన మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని పాత మంగళగిరికి చెందిన జె.కేశవరావు (62) బుధవారం ఉదయం 10 గంటలకు రోజుమాదిరి తన ద్విచక్ర వాహనంపై వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో గల పోస్టాఫీస్ కార్యాలయానికి బయలు దేరాడు. మార్గమధ్యంలోని యర్రబాలెం చెరువు కట్ట వద్దకు వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు వెంబడినే ఉన్న చెరువులోకి దూసుకువెళ్లింది. అయితే ఆ మార్గంలో ప్రయాణించే వారెవరూ ఈ ప్రమాదాన్ని గమనించలేదు. అదే రోజు మధ్యాహ్నం చెరువులో ఓ గుర్తు తెలియని మృతదేహం నీటిపై తేలియాడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానిక యువకుల చేత బయటకు తీయించారు. ద్విచక్ర వాహనం ఆచూకీ లభించలేదు. అప్పటికే మృతుడు కేశవరావు కడుపు ఉబ్బి ఉండటంతో పాటు మెడలో గుర్తింపు కార్డు వేలాడుతూ కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడు కేశవరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి ఓ గంట ముందు నగరంలోని హెడ్ పోస్టుమాస్టర్ నరసింహా రెడ్డిని కలసి తాను ఈ నెల చివరి నాటికి రిటైర్ కాబోతున్నానని, తనకు పోస్టల్‌శాఖ నుంచి రావల్సిన బెనిఫిట్స్‌కు సంబంధించిన పత్రాలను సిద్ధం చేయాలని కోరినట్లు సమాచారం.

రేపటి నుంచి ఉభయ రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

తెనాలి: కొలకలూరులోని కొలంకపురి నాటక కళాపరిషత్ ఉభయ రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఈనెల 5వ తేదీన ప్రారంభం కానున్నాయి. గ్రామంలోని శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయం ఎదుట ప్రత్యేక వేదికపై నాలుగురోజులు నిర్వహించనున్న పోటీలను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించనున్నారు. 8న ముగింపు కార్యక్రమంలో గోపరాజు వెంకట శివరామ సుబ్రహ్మణ్యశర్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు బహూకరించనున్నారు.